



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

# బెల్లం టీతో రక్తహీనతకు చెక్!

చాలామందికి టీ అలవాటు ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారు చక్కెరకు బదులు బెల్లం కలిపిన టీ తాగితే మంచిదని నిపుణులు చెబుతున్నారు. బెల్లం టీ తాగడం శరీరానికి ఎలాంటి హానీ జరుగదు. బెల్లంలో కేలరీలు తక్కువగా ఉండి అధిక బరువు సమస్య నివారణకు దోహదం చేస్తాయి. రక్తహీనత సమస్య ఉన్నవారు బెల్లం టీ తాగితే మేలని సూచితున్నారు. అందులో ఉండే ఐరన్ శరీరంలోని రక్తహీనతను నివారిస్తుంది. బెల్లం టీ తాగడంవల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని చెబుతున్నారు.



# తెలంగాణకు నూతన గవర్నర్..
# CP రాధాకృష్ణన్ కు అదనపు బాధ్యతలు



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గా తమిళిసై సౌందర రాజన్ నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలి మహిళా గవర్నర్ గా ఆమె బాధ్యతలు నిర్వహించారు. ఇక తమిళిసై రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు కొత్త గవర్నర్ ను నియమించారు. ఝార్ఖండ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను తెలంగాణ గవర్నర్ గా నియమించారు. ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ గా కూడా రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. పూర్తి స్థాయి గవర్నర్ ను నియమించేంత వరకు ఆయన అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణ ర్నర్ గా పనిచేసిన తమిళిసై తన పదవికి జీనామా చేయడం ప్రాధాన్యతను సంత చుకుంది. తెలంగాణ గవర్నర్ పదవికి, ుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి ళిసై రాజీనామా చేశారు. గత కొంత ంగా ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తు ంటూ జోరుగా ప్రచారం జరిగింది. ఈ థ్యంలో తమిళిసై రాజీనామా ఆ ప్రచా ికి మరింత బలాన్ని చేకూర్చింది. తమి ళనాడు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది.



## ఢిల్లీ పొల్యూషన్..
## వరల్డ్‌లోనే టాప్ ర్యాంక్ !

దేశ రాజధాని ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధాని నగరంగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని స్విస్‌కు చెందిన ఐక్యూ ఎయిర్ అనే సంస్థ విడుదల చేసిన వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2023లో వెల్లడించింది.ఈ సర్వేలో 2018 నుంచి వరుసగా నాలుగుసార్లు ఢిల్లీ అత్యంత కాలుష్య రాజధానిగా టాప్‌లో ఉంటూ వస్తోంది. 2022లో ఢిల్లీ పీఎం 2.5 లెవెల్స్ క్యూబిక్ మీటర్‌కు 89.1 మైక్రో గ్రాములు ఉండగా 2023లో ఇది 92.7 గ్రాములకు చేరింది.ఇక బీహార్‌లోని బెగుసరాయ్ పట్టణం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య పట్టణమని ఐక్యూ ఎయిర్ తెలిపింది. క్యూబిక్ మీటర్‌కు 54.4 మైక్రోగ్రాముల పీఎం 2.5 కాన్సంట్రేషన్‌తో ప్రపంచంలోనే మూడవ అత్యంత కాలుష్య దేశంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల తర్వాత భారత్ ఉందని వెల్లడించింది. ఐక్యూ ఎయిర్ కాలుష్య దేశాల ర్యాంకుల్లో 2022లో భారత్ ర్యాంకు 8గా ఉండగా 2023లో 3వ ర్యాంకుకు ఎగబాకింది. దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## దిశా పటాని
## అందాల సునామీ..



ఫోటోషూట్స్ షేర్ చేస్తుండటం ఎప్పటినుంచో హ్యాబీగా పెట్టుకుంది దిశా పటానీ. అందాల గాలం వేస్తూ ఫాలోయింగ్ పెంచుకోవడంలో ఈ బ్యూటీ ముందు వరుసలో ఉంటుంది. తరచూ బికినీల్లో కనిపిస్తూ అభిమానుల మతి పోగొడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ అమ్మడు తన ఇన్స్ స్టా వేదికగా షేర్ చేసిన కొన్ని ఫొటోస్ నెట్టింట హీటు పెంచాయి.2016లో వచ్చిన ఎమ్మెస్ ధోనీ అన్‌టోల్డ్ లవ్‌స్టోరీ సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన దిశా పటానీ ఆ తర్వాత పలు సినిమాల్లో భాగమవుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భాగీ, భారత్, మలంగ్‌లాంటి సినిమాలతో ఆమె క్రేజ్ అమాంతం పెరిగిపోయింది.సోషల్ మీడియానే అస్త్రంగా చేసుకొని తన పాపులారిటీ పెంచుకుంటోంది దిశా. ఎప్పటికప్పుడు పరువాల విందు ఇస్తూ ఫాలోయింగ్ రెట్టింపు చేసుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో దిశా పటాని క్రేజే వేరు అని ఆమె ఫాలోవర్స్ సంఖ్య చూస్తే అర్థం చేసుకోవచ్చు.



## త్వరలో మరో నలుగురు ఎమ్మెల్యేలు
## కాంగ్రెస్ గూటికి..

ప్రత్యర్థి పార్టీల్లో కీలక నేతలే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు రాజధానిలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు మరో నలుగురైదుగురు భారాస ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడానికి కాంగ్రెస్ అగ్రనేతలు వేగంగా చక్రం తిప్పుతున్నారు. వీరి నుంచి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మాట తీసుకుందని చెబుతున్నారు. మరికొందరు భారాస నేతలు హస్తం గూటికి చేరడానికి ప్రయత్నిస్తున్నారు. భారాస నుంచి చేరిన వారిలో ఆర్థికంగా ఉన్న వారిని లోక్‌సభ బరిలో నిలపాలని కాంగ్రెస్ యోచిస్తోంది. దీనికి అనుగుణంగా మంగళవారం దిల్లీలో జరిగే కాంగ్రెస్ అగ్ర నేతల సమావేశంలో అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. బహుశా అదేరోజు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు పార్టీ అగ్రనేత ఒకరు తెలిపారు.

**పదవులు.. హామీలు..**

గ్రేటర్ పరిధిలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం మూడు సీట్లనే కాంగ్రెస్ గెలిచింది. దీంతో సిటీలోని నాలుగు ఎంపీ స్థానాలను గెలవాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల మీట్‌ది ప్రెస్‌లోనూ ఆయన వెల్లడించారు. "గ్రేటర్ పరిధిలో అన్ని స్థానాల్లో విజయం సాధించడానికి మా వ్యూహాలు మాకున్నాయి...మీరే చూడండి" అని సీఎం అన్నారు. ఆయన మాటల వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు అర్థమవుతోందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. నగరం పరిధిలో పట్టున్న ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను వేగం చేసింది. కొందరికి పదవులు ఆశ చూపుతున్నారు.



## కడప లోక్‌సభ స్థానం నుంచి
## షర్మిల పోటీ?

కడప లోక్‌సభ స్థానం నుంచి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం ఆదేశాల మేరకు కడప నుంచి బరిలో దిగే అవకాశం ఉందని, కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాలో షర్మిల పేరు ఉండనున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కడప లోక్‌సభ స్థానం నుంచి వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి సౌభాగ్యమ్మ లేదా కుమార్తె సునీత పోటీ చేస్తారని, వారి విజయానికి షర్మిల సహకరిస్తారని ఇప్పటివరకు రాజకీయ వర్గాలు భావించాయి. మరోవైపు సునీత పోటీ చేస్తే ఏకగ్రీవంగా మద్దతిస్తామంటూ ఈ నెల 15న కడపలో నిర్వహించిన వివేకా అయిదో వర్ధంతి కార్యక్రమంలో.. తెదేపా, భాజపా, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు ప్రకటించారు.ఆ కార్యక్రమంలో షర్మిల క్రియాశీలకంగా వ్యవహరించారు.



## ముంబైలోనూ నీటి కష్టాలు

దేశంలో ఐటీ హబ్‌గా పేరొందిన బెంగళూరులో చుక్క నీటి కోసం జనం తహతహలాడుతున్నారు. ఇప్పుడు ముంబైలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) తాజాగా నీటి సరఫరాను ఐదు శాతంమేరకు తగ్గించింది. ఈరోజు ముంబైలో నీటి కోత 15 శాతం మేరకు ఉంటుందని ప్రకటించింది. దీంతో ముంబైవాసులలో ఆందోళన పెరిగింది. నిర్వహణ పనుల కారణంగా నీటి సరఫరాను తగ్గించినట్లు బీఎంసీ పేర్కొంది. పౌర సంఘం తెలిపిన వివరాల ప్రకారం థానే జిల్లాలోని పైస్ డ్యామ్‌లో నీటి కొరత కారణంగా నగరం అంతటా అదనపు నీటి కోత విధించారు. తాజాగా బీఎంసీ ఒక ప్రకటనలో మహానగరానికి 60 కి.మీ దూరంలో ఉన్న డ్యామ్‌కు భట్సా రిజర్వాయర్ నుండి నీరు వచ్చిన తర్వాత నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుందని తెలిపింది. ఇదిలావుండగా ఆసియాలోని అతిపెద్ద ప్లాంట్‌లలో ఒకటైన భాండూప్‌లోని వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌లో క్లీనింగ్ కారణంగా మార్చి 15 నుండి ఏప్రిల్ 24 వరకు ముంబైలో ఐదు శాతం నీటి కోతను బీఎంసీ ప్రకటించింది. డ్యామ్‌లో నీటి మట్టం తక్కువగా ఉన్నందున గతంలో పది శాతం నీటిని తగ్గించాలని ప్రతిపాదించింది. కాగా కర్ణాటక రాజధాని బెంగళూరు ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. నీటి కోసం ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. ఇక్కడ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదంటే బెంగళూరులో 14 వేల బోర్‌వెల్స్‌లో 6,900 ఎండిపోయాయి. దీంతో పాటు చెరువులన్నీ కూడా దాదాపు అడుగంటిపోయాయి.

## సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్‌కు జాక్ పాట్
### బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి..



టెస్టు క్రికెట్ అరంగేట్రంలోనే సత్తాచాటిన టీమిండియా ఆటగాళ్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ జాక్ పాట్ తగిలింది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో వీరిద్దరికి చోటు దక్కింది. వీరిద్దరికి గ్రేడ్-సీ కాంట్రాక్ట్ ఇస్తున్నట్లు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. సోమవారం (మార్చి 18) జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా బీసీసీఐ కాంట్రాక్టు పొందాలంటే ప్రస్తుత సీజన్ లో కనీసం మూడు టెస్టులు లేదా ఎనిమిది వన్డేలు లేదా పది టీ20లు ఆడాల్సి ఉంటుంది. అయితే ఈ ఇద్దరూ ఇంగ్లండ్ తో చెరో మూడు టెస్టులు ఆడిన కారణంగా నేరుగా సీ-గ్రేడు జాబితాలో బీసీసీఐ చేర్చింది. సీ-గ్రేడ్ కేటగిరీ కింద వీరు రూ. కోటి వార్షిక వేతనం అందుకోనున్నారు. ఇక ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సర్ఫరాజ్ అదరగొట్టాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ హాఫ్ సెంచరీలతో చెలరేగాడు. అతడితో పాటు యువ వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ సైతం సత్తాచాటాడు. రాంచీ టెస్టులో 90, 39 స్కోర్లతో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ధ్రువ్ నిలిచాడు. వీరిద్దరి అద్భుత ప్రదర్శన కారణంగానే కేవలం మూడు మ్యాచ్‌లకే బీసీసీఐ కాంట్రాక్ట్‌లు అప్పగించింది. కాగా 2023-24 సంవత్సరానికి గాను సెంట్రల్ కాంట్రాక్ట్ పొందిన ఆటగాళ్ల జాబితాను బీసీసీఐ గత నెలలో ప్రకటించింది. ఈ జాబితాలో మొత్తం 30 మంది ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. అనూహ్యంగా యువ క్రికెటర్లు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌కు ఈ జాబితాలో చోటు దక్కలేదు.


సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## మరో అతిథి పాత్రలో తృప్తి డిమ్రి?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాబోతున్న సినిమా పుష్ప 2: ది రూల్. ఇప్పటికే, ఈ సినిమా పై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై ఇప్పటికే ఎన్నో రూమర్లు వినిపించాయి. తాజాగా మరో రూమర్ వినిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించి మెప్పించింది 'తృప్తి డిమ్రి'. మొత్తానికి తృప్తి డిమ్రి ఓవర్ నైట్ లోనే స్టార్‌గా మారింది. ఐతే, తృప్తి డిమ్రి ఇప్పుడు పుష్ప 2లో ఓ అతిథి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. పుష్ప రాజ్ అనుచరుడిని ట్రాప్ చేయించి చంపించే పాత్రలో తృప్తి డిమ్రి కనిపిస్తోందట. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారు. ఆగస్టు 15న, 2024లో ఈ చిత్రం రిలీజ్ కాబోతుంది.





# రామ్‌దేవ్‌బాబాకు సుప్రీంకోర్టు సమన్లు

యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు మంగళవారం సుప్రీంకోర్టు సమన్లు జారీచేసింది. పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయనతో పాటు మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో ధిక్కార పిటిషన్‌పై సమాధానం ఇవ్వకపోవడంతో ఈ సమన్లు ఇచ్చింది. ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ 'అసత్య', 'తప్పుదోవ' పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని సూచించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరఫున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అయితే, ఆ ఆ హామీని ఉల్లంఘించడంపై గత నెల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ రామ్‌దేవ్ బాబాకు, ఆచార్య బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ప్రకటనల విషయంలోనూ కొన్ని సూచనలు చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఎలాంటి ప్రచారం చేయొద్దని మరోసారి సూచించింది. అయితే, ఆ నోటీసులకు పతంజలి సమాధానం ఇవ్వడంలో విఫలమైంది. 'మీ ప్రతిస్పందన ఎందుకు దాఖలు చేయలేదు..?' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమనుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరు కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది.



## ఏపీలో జగన్‌కు భారీ షాక్.. కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ ఎమ్మెల్యే

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. దీంతో ఆయా పార్టీలు అసెంబ్లీకి పోటీ చేయబోయే అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. అయితే సీటు దక్కని నేతలు పార్టీలు మారుతున్నారు. ఈ క్రమంలోనే నందికొట్కూర్ వైసీపీ ఎమ్మెల్యే ఆర్థర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో ఆర్థర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షర్మిల ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల ప్రకటించిన వైఎస్సార్‌సీపీ జాబితాలో ఆర్థర్ పేరు లేదు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. నందికొట్కూర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఆర్థర్ అసెంబ్లీకి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి.

## 'CAA'పై పిటిషన్‌లు.. ఇవాళ సుప్రీం విచారణ

కేంద్రం ఇటీవల అమలులోకి తీసుకువచ్చిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (CAA)పై స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లను సుప్రీంకోర్టు ఇవాళ విచారించనుంది. CAAపై స్టే కోరుతూ సుప్రీంలో ఇప్పటివరకు ఏకంగా 230 పిటిషన్లు ఫైల్ అయ్యాయి. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌లను విచారించనుంది.




## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మృతి

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లోని రేపన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కోలా మరక అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మృతిచెందారు. వారిని మంచిర్యాల డివిజన్ కమిటీ సెక్రటరీ వర్గీస్, చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మగ్తూ, ప్లాటూన్ సభ్యులు కుర్సంగ్ రాజు, కుడిమెట్ట వెంకటేశ్‌గా గుర్తించారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఇద్దరిపై పోలీసులు శాఖ గతంలో భారీ రివార్డు ప్రకటించింది. వారిపై రూ.36 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతున్నదని వెల్లడించారు.



## ఐపీఎల్ కోసం కోహ్లి న్యూ లుక్..

టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి మైదానంలో అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్-2024 సీజన్‌తో విరాట్ రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఇప్పటికే ఆర్సీబీ జట్టుతో కలిసిన కోహ్లి.. నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. అయితే ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌కు ముందు కింగ్ కోహ్లి న్యూ లుక్‌లో కన్పించాడు. ఎప్పటికప్పుడు సరికొత్త హెయిర్ స్టైల్‌తో అభిమానులను అకట్టుకునే విరాట్.. ఇప్పుడు మరో కొత్త హెయిర్ స్టైల్‌లో దర్శనిమిచ్చాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా కోహ్లికి హెయిర్ స్టైల్ చేసింది ఎవరో కాదు.. సెలబ్రిటీ హెయిర్ స్టైలిష్ట్ అలీమ్ హకీమ్. మన దేశంలో టాప్ సెలెబ్రిటీలకు అతడే హెయిర్ స్టైలింగ్ చేస్తుంటాడు. గత సీజన్ ఆరంభానికి ముందు విరాట్ కొత్త హెయిర్ స్టైల్‌లో కన్పించాడు. అది చేసినది కూడా అలీమ్ హకీమే కావడం గమనార్హం. ఇక ఐపీఎల్ 17వ సీజన్‌లో ఆర్సీబీ తమ తొలి మ్యాచ్‌లో మార్చి 22న చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ క్యాష్‌రిచ్ లీగ్ ఆరంభానికి ముందు ఆర్సీబీ అన్‌బాక్స్ ఈవెంట్‌ను నిర్వహించనుంది. మార్చి 19(మంగళవారం) బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ ఈవెంట్ జరగనుంది. ఈ కార్యక్రమంలో విరాట్ సందడి చేయనున్నాడు.






## సూడాన్‌లో ఆకలి సంక్షోభం

గతేడాది నుంచి కొనసాగుతున్న యుద్ధం కారణంగా సూడాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. యుద్ధం కారణంగా సూడాన్‌లో 5 మిలియన్ల మంది ప్రజలు భయంకరమైన ఆకలి బాధితులుగా మారవచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. 7,30,000 మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని UN సహాయ చీఫ్ చెప్పారు. రానున్న నెలల్లో సూడాన్‌లో సుమారు 5 మిలియన్ల మంది ప్రజలు తీవ్ర ఆకలిని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది.



## లోయలో పడ్డ బస్సు.. 8 మంది మృతి

నేపాల్‌లోని బగ్‌లుంగ్ జిల్లా నిసిఖోలా ప్రాంతంలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు 200 మీటర్ల లోతులో పడిపోయింది. ఈ దుర్ఘటనలో బస్సులోని 8 మంది ప్రయాణికులు చనిపోయారు. మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అధికారులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. బస్సు రుకుమ్ పుర్బా నుంచి ఖాట్మండుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు.



## ఎన్నికల కౌంటింగ్‌పై హైకోర్టుకు కేఏ పాల్

ఏపీలో ఎన్నికలు ఏప్రిల్ నెలలో నిర్వహించి, ఓట్లను మేలో లెక్కించడం ఏంటని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఏపీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికలకు, లెక్కింపునకు మధ్య 21 రోజుల గ్యాప్ ఉందని, ఈవీఎం ట్యాంపరింగ్ కు అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాల్ వాదనలు విన్న కోర్టు, తగిన నిర్ణయాన్ని వెలువరించాలని సూచిస్తూ ఈసీకి నోటీసులు జారీ చేసింది.



## సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్న కవిత

ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన కవిత.. సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఈడీ సమన్లు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ఆమె ఉపసంహరించుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఈడీ అరెస్టు చేసిన నేపథ్యంలో.. రిట్ పిటిషన్‌పై విచారణ అవసరం లేనందున వెనక్కి తీసుకుంటున్నామని కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వెల్లడించారు. దీనికి జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం అనుమతించింది. తాము చట్ట ప్రకారం ఉపశమనం పొందేందుకు తదుపరి చర్యలకు వెళ్తామని న్యాయవాది తెలిపారు. ఈడీ జారీ చేసిన సమన్లను సవాలు చేస్తూ.. గత ఏడాది మార్చి 14న సుప్రీంకోర్టులో కవిత ఈ పిటిషన్ దాఖలు చేశారు.



## 'వందేభారత్'పై రాళ్ల దాడి

యూపీలోని లక్నో నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్తున్న వందే భారత్ రైలుపై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో ఆ రైలు కిటికీ అద్దాలు పగిలిపోయాయి. ఈ సంఘటన శ్రీరాజ్ నగర్- బచ్రావాన్ మధ్య జరిగింది. గేట్ నంబర్ 178 సమీపంలో రైలుపై బయటి నుంచి ఎవరో రాళ్లు విసిరారు. దీంతో రైలులోని C-3కోచ్ కిటికీ అద్ధం బద్దలయ్యింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.